క్లుప్తంగా

రేపు వరదరాజుల స్వామి కల్యాణోత్సవం


వరదరాజులస్వామి

లింగాల : వెలిదండ్ల గ్రామ సమీపంలోని దేవర కోనలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత వరదరాజులస్వామి ఆలయంలో గురువారం కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం గ్రామం నుంచి వరదరాజులస్వామి ఆలయం వరకు స్వామివారి ఆభరణాలు, పట్టువస్త్రాలు భాజా భజంత్రీలతో తీసుకువెళ్లి భూదేవి శ్రీదేవి సమేత వరదరాజులస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారన్నారు. ప్రతీ ఏటా మొలకల పౌర్ణమి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోందన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు స్వామి వారి కల్యాణంలో పాల్గొనాలని వారు తెలిపారు.

సకాలంలో పూర్తి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి

సింహాద్రిపురం : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిషత్ సభాభవనంలో మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇచ్చిన సమయానికి పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, తహసీల్దార్ భీమేశ్వరరావు, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కోగటంలో నాకా బందీ


కోగటంలో నాకా బందీ నిర్వహిస్తున్న పోలీసులు

కమలాపురం : మండల పరిధిలోని కోగటం గ్రామంలో పోలీసులు మంగళవారం నాకాబందీ నిర్వహించారు. కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ రిషీకేశవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలో తనిఖీలను చేపట్టారు. అనుమానితుల గృహాలు, ఖాళీ ప్రదేశాల్లో సోదాలను నిర్వహించారు. గొడవలకు పాల్పడి శాంతి భద్రతలకు భంగం కలించడానికి ప్రయత్నించిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్థానికులను హెచ్చరించారు.

అడ్మిషన్లు ప్రారంభం

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని వైఎస్ రాజారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం కొరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తెలుగు, ఇంగ్లీషు మీడియం బోధనలు ఉన్నాయని, హెచ్ఈసీ మాత్రం తెలుగు మీడియం బోధనలున్నాయన్నారు. జూన్ 1వ తేదీ నుంచి కళాశాల ప్రారంభం అవుతుందని ఆమె తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9642385823, 9491012232 నెంబర్లను సంప్రదించాలన్నారు.

శిక్షణ తరగతుల బకాయిలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : సమగ్రశిక్ష పథక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా తరగతులకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌లు కోరారు. ఈ విషయమై మంగళవారం సమగ్రశిక్ష పథక ఇన్‌చార్జు జిల్లా అధికారి మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో మదనపల్లి కేంద్రంగా 10 విడతలుగా ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజులపాటు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులందరికీ రీడర్‌షిప్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తరగతులను నిర్వహించామన్నారు. ఈ శిక్షణా తరతులకు హాజరైన ప్రధానోపాధ్యాయులకు చెల్లించాల్సిన రవాణాభత్యం నేటికి చెల్లించలేదని ఎస్ఎస్ఏ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గత ఏడాది నవంబర్ నెలలో గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు, అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణా తరగతులకు సంబంధించిన బకాయిలను కూడా చెల్లించలేదన్నారు. సమగ్ర శిక్ష పథకంలో పనిచేస్తున్న సీఆర్‌సీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, సమగ్రశిక్షపథకం ఉద్యోగులందరికి గత మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదన్నారు. దీనిపై స్పందించిన మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ సమగ్రశిక్ష ఉద్యోగులందరికి రెండు రోజుల్లో వారి ఖాతాలకు జీతాలు జమ అవుతాయని తెలిపారు.

అర్హులనే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలి


పాల్గొన్న వివిధ పార్టీల నేతలు


మాట్లాడుతున్న ఆర్వో గణేష్‌కుమార్

కమలాపురం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోటీలో వున్న అభ్యర్థులు జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్‌కు అర్హులైన వారిని మాత్రమే తమ ఏంజెట్లుగా నియమించుకోవాలని జాయింట్ కలెక్టర్, కమలాపురం రిటర్నింగ్ ఆఫీసర్ గణేష్ కుమార్ తెలిపారు.

కమలాపురంలోని ఆర్వో కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి కేసులు లేని వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఫారం–18 పూర్తి చేసి ఇస్తే, వారి గురించి పరిశీలన చేసిన తరువాత అర్హులైతేనే ఏజెంట్లుగా అనుమతిస్తామన్నారు. కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్శిటీలో కౌంటింగ్ జరుగుతుందిని తెలిపారు. అభ్యర్థులతో పాటు కౌంటింగ్ ఏజెంట్లకు పాసులు మంజూరు చేస్తామని, అభ్యర్థులకు వెహికల్ పాసులను ఇస్తామని తెలిపారు. పాసులు పొందిన వారు ఆరోజు ఉదయం 7 గంటలకు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. కమలాపురం నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ ప్రక్రియకు 14 టేబుల్లు ఏర్పాటు చేస్తామని, మొత్తం 18 రౌండ్లలో కౌంటింగ్ పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో సుబ్రమణ్యం, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు న్యాయం జరుగుతుంది : డీఎస్పీ


రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ

జమ్మలమడుగు : ప్రతి రైతుకు న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. కొండాపురంలో గోదాము యజమాని పరారీలో ఉండటంతో ఆ గొదాములో శనగలు నిల్వ చేసుకున్న రైతులు తమకు న్యాయం చేయాలంటూ డీఎస్పీ యశ్వంత్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రైతులతో మాట్లాడుతూ రైతులకు సంబంధించిన పంట గొదాములలో నిల్వ ఉందని రైతులకు పంపిణీ చేయడం కోసం రెవెన్యూ, అగ్రి కల్చర్, మార్కెటింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు కచ్చితంగా న్యాయం చేసేవిధంగా చూస్తామన్నారు. రైతులు తమ పంటలను గొదాముల్లో ఉంచినట్లు స్లిప్పులు ఉంచుకోవాలన్నారు. ఆదేవిధంగా అనామత్తులో పెట్టిన రైతుల వివరాలను సైతం సేకరించి గొదాముల రికార్డులో పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. రైతులు ఒక కమిటీగా ఎర్పడి తమతో సంప్రదించాలన్నారు. గొదాములలో ఉన్న సరుకు రవాణ చేసుకోకుండా పోలీసులను కాపలా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ యోగీంద్ర, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్‌లు ప్రారంభం

చక్రాయపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ షేక్ రంతుబాషా తెలిపారు. 10 తరగతి పాసైన విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులలో తెలుగు, ఇంగ్లీషు మీడయం లలో ప్రవేశాలు కోరువారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాల పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్ర 4:30 లోపు వచ్చి అడ్మిషన్ పొందవచ్చునన్నారు. పూర్తి వివరాలకు 9441961457 నంబరును సంప్రదించాలన్నారు.

గృహ నిర్మాణ పనులపై సమీక్ష


గృహ నిర్మాణ పనులపై సమీక్ష చేస్తున్న అధికారులు

ఎర్రగుంట్ల : పట్టణంలో నిర్మాణంలో ఉన్న గృహనిర్మాణ పనులపై మండల ప్రత్యేక అధికారి శాంతి, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, గృహ నిర్మాణశాఖ ఏఈ రామకృష్ణలు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, హోల్డ్‌లో ఉన్న బిల్లులపై సమీక్ష చేసి రికవరీ విషయంపై కూడా చర్చించారు. పనులు చేపట్టాలని సంబంధిత సచివాలయ సిబ్బందికి సూచించారు. సమావేశంలో కాంట్రాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే అటువంటి వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేయడంతో పాటు జిల్లా బహిష్కరణ చేయడం జరుగుతుందని తలమంచిపట్నం ఎస్ఐ హనుమంత్ తెలిపారు. మంగళవారం తలమంచిపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని గ్రామాల్లో ఎక్కడ కూడా ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. 13వ తేదీ జరిగిన ఎన్నికల్లో మైలవరం మండలం సి. కొత్తపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ, ఎన్డీయే పార్టీకు చెందిన వారు గొడవ పడటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 మందిపై, అలాగే ఎన్డీయే పార్టీకు చెందిన 11 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వీరిని మంగళవారం కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

జమ్మలమడుగు : ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం స్కానింగ్ చేసి లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్య నేరమని డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులలో ఆమె తనిఖీలను నిర్వహించి స్కానింగ్ సెంటర్‌లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్కానింగ్‌లను గర్భాశయంలో ఉన్న పిల్లల పెరుగుదలకు మాత్రమే ఉపయోగించుకోవాలే తప్ప ఆడ, మగ అని నిర్ధారణ చేయడం చట్టరీత్య నేరంగా పరిగణించబడుతుందన్నారు. స్కానింగ్‌లో లింగ నిర్ధారణ చేసినట్లు రుజువు అయితే జరిమానాతో పాటు జైలు శిక్ష, డాక్టర్ సర్టిఫికేట్‌లను రద్దు చేయడం జరుగుతుందన్నారు. వైద్యులు వృత్తిని దైవంగా భావించి విధులను నిర్వహించాలన్నారు. ఆడపిల్లలను కాపాడుకునే విధంగా అందరం కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్ : కడప నగరంలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలోని బాసట చిల్డ్రన్స్ హోమ్‌లో ప్రవేశానికి అవసరార్థులు, అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకులు మేరువ బాలాజీరావు తెలిపారు. కడప నగరంలోని తమ చిల్డ్రన్స్ హోంలో తల్లిదండ్రులు లేదా ఇద్దరిలో ఎవరో ఒకరు లేకపోయిన ఇందులో ప్రవేశానికి అర్హులన్నారు. 5 నుంచి 15 సంవత్సరాల వరకు వయస్సుగల బాలురకు ప్రవేశం కల్పిస్తామన్నారు. మంచి చదువుతోపాటు భోజన, వసతి మెరుగైన సదుపాయాలతో క్రమశిక్షణ, విలువలతో పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న సదుద్దేశంతో ఈ హోమంను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 29 వ తేదీ లోపల పిల్లల పూర్తి వివరాలతో 81420 47682, 98494 89206 నెంబర్లలో లేదా హోంలో సంప్రదించాలని సూచించారు. సోమవారం కడప నగరానికి చెందిన సాయి ప్రియాంక, హేమానుదీప్‌లు చిల్డ్రన్స్ హోమ్ సభ్యుడు డి.కార్తీక్‌రెడ్డి ద్వారా రూ. 20వేలు విరాళం అందజేశారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

బి.కోడూరు : మండలంలోని పాయలకుంట్ల పంచాయతీ యెర్రిఓబన్నబావి సమీపాన కొండపై వెలసిన శ్రీనల్లగొండ లక్ష్మీనరసింహస్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 20వ తేదీన ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం ప్రాతఃకాలపూజ, మహానివేదన, అభిషేకాలు, అర్చన, తీర్థప్రసాద వినియోగం, మంగళహారతి, భజన తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు జయరాం బాబుస్వామి నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం, సాయంత్రం 4 గంటల నుంచి కోలాటం ఉంటుందన్నారు.

వైభవంగా శేష వాహన సేవ


వెయ్యినూతల కోనలో శేష వాహన సేవలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి

పెండ్లిమర్రి : వెయ్యినూతలకోన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా శేష వాహన సేవ నిర్వహించారు. ముందుగా అష్టోత్తర శతకలశ స్నపనం, చతుస్థానార్చన, రాత్రి శేషవాహన సేవ వంటి కార్యాక్రమాలు వైభవంగా నిర్వహించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు నరసింహస్వామి జయంతి

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, వేద పారాయనం, మహామంగళహారతి, సాయంత్రం హనుమత్ వాహనం వంటి కార్యాక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా మారెమ్మతల్లి వారోత్సవం


ప్రత్యేక పూజలందుకుంటున్న మారెమ్మ తల్లి

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మతల్లి అమ్మవారి తొమ్మిదవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, అమ్మవారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణ రాధా కోలాట బృందం వారిచే కోలాటం నిర్వహించారు. బుధవారం గ్రామ సుభిక్షం కోసం అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.


అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

ఘనంగా నిత్యకల్యాణ మూర్తుల బ్రహ్మోత్సవాలు


పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అర్చకులు

కమలాపురం : మండల పరిధిలోని శ్రీ రామాపురం పుణ్య క్షేత్రంలో వెలసిన శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్షణ నారాయణస్వామి, శ్రీ వల్లీ దేవ సేన సమేత సుబ్రమణ్యస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు శ్రీ కశీభట్ల సత్యసాయి నాథశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం గణపతి పూజ, మహా సంకల్పం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం యాగ శాలక ప్రవేశం చేసి వివిధ హోమాలను నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణంతో సకల దేవతలను ఆహ్వానించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం శ్రీ మోక్ష నారాయణస్వామికి హనుమద్వాహన సేవను నిర్వహించారు. శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి వృషభ వాహన సేవను నిర్వహించారు. ఆలయ మాడ వీధులలో ఉత్సవ మూర్తుల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కనుల పండువగా నత్తడ్‌షా వలీ ఉరుసు


నత్తడ్‌షా వలీ దర్గా

ఖాజీపేట : ఖాజీపేట పట్టణ పరిధి అగ్రహారంలోని నత్తడ్‌షా వలీ దర్గా ఉరుసు ఉత్సవాలు రెండు రోజులుగా అత్యంత వైభవంగా జరిగాయి. మంగళవారం సర్వర్‌ఖాన్ పేట నుంచి జెండా మహోత్సవం జరిగింది. మసీదు నుంచి ప్రారంభమైన జెండా మహోత్సవం రాత్రి దర్గా వద్దకు చేరడంతో ముగిసింది. రాత్రి వేళ అన్వర్ ఖాన్, సర్‌ఫరజ్ సాబ్రీ చే నిర్వహించిన ఖవ్వాలి అందరినీ అలరించింది. పెద్ద ఎత్తున పిల్లలు, పెద్దలు దర్గా వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన ఊయలలు, రకరకాల ఆట పరికరాలతో పిల్లలు ఎంతో సంతోషంగా కటుంబ సభ్యులతో వినోదం పొందారు. భక్తులకు ఆటో శ్రీను అన్నదానం నిర్వహించారు.

కడుతున్నవి ఇళ్లు కాదు.. ఊళ్లు


ఈమె పేరు మేడా పార్వతి. ప్రొద్దుటూరు మండలంలోని రామేశ్వరం జగనన్న కాలనీలో కుమార్తె గీతాంజలితో కలసి నివాసం ఉంటోంది. గతంలో వీరు ఆర్ట్స్ కాలేజీ వద్ద అద్దె ఇంటిలో ఉండేవారు. ప్రతి నెల రూ.6 వేల అద్దె చెల్లిస్తుండే వారు. గీతాంజలి భర్త ప్రసాద్ ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ప్రభుత్వం జగనన్న కాలనీలో స్థలం, ఇల్లు మంజూరు చేసింది. దీంతో వీరు ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. ప్రస్తుతం అద్దె చెల్లించాల్సిన తిప్పలు తీరాయని వారు పేర్కొన్నారు.


ఈమె పేరు హసీనా. ప్రొద్దుటూరు మండల పరిధిలోని ఈశ్వర్‌రెడ్డినగర్‌లో అద్దె ఇంటిలో నివాసం ఉండేవారు. ప్రతి నెల ఇంటికి రూ.3 వేలు అద్దె చెల్లించే వారు. రామేశ్వరం జగనన్న కాలనీలో ప్రభుత్వం వీరికి స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేసింది. దీంతో వారు ఇల్లు నిర్మించుకుని, గత నెలలో చేరారు. హసీనా, ఆమె భర్త నాసీర్ ఖాన్ ఇద్దరూ టైలర్ వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నారు. తమ సొంతింటి కల నెరవేరిందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

ఇదీ వీరిద్దరి పరిస్థితే కాదు. ఎంతో మంది పేదలు జగనన్న కాలనీల్లో ఇల్లు పొందారు. వారందరూ ఇలాంటి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ శివారు ప్రాంతాలు నూతన గృహాలతో సరికొత్త శోభ సంతరించుకుంటున్నాయి. జగనన్న కాలనీలు ఊళ్లుగా రూపాంతరం చెందుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' హామీ నెరవేర్చేందుకు అడుగులు వేశారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు శ్రీకారం చుట్టారు. అర్హులందరికీ స్థలాలు మంజూరు చేసి, ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహాయజ్ఞంలా చేపట్టింది. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- పేదల సొంతింటి కల సాకారం
- సర్వాంగ సుందరంగా జగనన్న కాలనీలు
- మౌలిక సదుపాయాలు కల్పన
- లబ్ధిదారుల్లో సంతోషం


జగనన్న కాలనీ డ్రోన్ వ్యూ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంలో జగనన్న కాలనీల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇళ్ల నిర్మాణం పూర్తయితే ఆ కాలనీలు ప్రత్యేక పట్టణాలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. రాయలసీమలోనే ఇంత పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం జరగలేదు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీతోపాటు సోములవారిపల్లె, కొత్తపల్లె, గోపవరం, దొరసానిపల్లె గ్రామ పంచాయతీల పరిధిలోని వారికి ప్రత్యేకంగా జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలను ఇచ్చారు. బొల్లవరం జగనన్న కాలనీ, రామేశ్వరం జగనన్న కాలనీ, మీనాపురం జగనన్న కాలనీలుగా ఇవి రూపుదిద్దుకున్నాయి. ఒక్కొక్క కాలనీలో 6 వేల ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లోని మిగతా గ్రామాలకు కలిపి మొత్తం 24 వేల ఇళ్లను నిర్మిస్తున్నారు. ప్రొద్దుటూరు ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి సుమారు 500 ఎకరాల భూమిని ప్రభుత్వం రూ.200 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. వీటిలో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ప్రభుత్వం ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి సంబంధించి రూ.లక్షా 80 వేలు మంజూరు చేసింది. నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఉచితంగా అందిస్తోంది. అంతేకాక ఐరన్, సిమెంట్‌ను సబ్సిడీ ధరలకు ఇస్తోంది. ఒక్కో ఇంటిలో 340 చదరపు అడుగుల్లో లివింగ్ రూమ్, బెడ్‌రూమ్, కిచెన్, టాయిలెట్, వరండా ఉంటాయి. 2 ఫ్యాన్లు, 2 ట్యూబ్‌లైట్లు, 4 బల్బులను ఉచితంగా అందిస్తున్నారు. విద్యుత్ మీటర్‌ను ఉచితంగానే ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సుమారు మూడు కాలనీల్లో 8 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. చాలా మంది పేదలు వీటిలో నివాసం ఉంటున్నారు. కాలనీల్లో గ్రావెల్ రోడ్లతోపాటు వీధిలైట్లు ఏర్పాటు చేశారు.

గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం జరగలేదు

చంద్రబాబు ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఇళ్ల నిర్మాణ ప్రక్రియ జరగలేదు. ఎన్నికలకు ఏడాది ముందు టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్న లబ్ధిదారులు చాలా కాలం పాటు తిరిగి ఈ డబ్బును చెల్లించే పరిస్థితి ఉండేది. ఈ కారణంగా ప్రజలు టిడ్కో ఇళ్లపై ఆసక్తి చూపలేదు. ముందు డిపాజిట్ చెల్లించిన వారికి ఆ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వం చెల్లించింది. గత ఏడాది డిసెంబర్ 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మూడు కాలనీల్లో లబ్ధిదారులకు అధికారులు తాళాలు అందించి గృహ ప్రవేశాలు చేయించారు.


కాలనీలో ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డు, విద్యుత్ సౌకర్యం